సాక్షి
నిజామాబాద్
గురువారం। 29। మే। 2025



**వెనువెంటనే అనుమతులు**
రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ అనుమతులు జారీ చేసేందుకు కొత్త పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది.
- 8లో ▸



**యువవికాసం లబ్ధిదారులకు..**
రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులకు జూన్ 2న మంజూరు పత్రాలు అందజేయనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు.
- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
37.1 /22.2
**వాతావరణం**
ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఓ మోస్తరునుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

## న్యూస్‌రీల్

### ప్రభుత్వ పథకాల అమలు తీరు పరిశీలన



**పెర్కిట్(ఆర్మూర్):** ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామాన్ని బుధవారం కేంద్ర హోం శాఖ బృందం విక్రం సింగ్ గుర్జార్, శిఖా సిన్హా, సుదేష్ కన్వాలన్ సందర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలును ప్రత్యక్షంగా పరిశీలించారుఉ. రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్లు, ఎన్‌ఆర్‌ఈజీఎస్, పంట రుణాల మాఫీ పథకాలపై, అమలు గురించి స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో బ్రహ్మానందం, డీఎల్‌పీవో శివకృష్ణ, ఎంపీవో శ్రీనివాస్, ఏవో హరికృష్ణ, ఏపీవో సురేష్, జీపీ కార్యదర్శి హారిక పాల్గొన్నారు.

**మాక్లూర్‌లో..**
**మాక్లూర్:** మండలంలోని అమ్రాద్, ముల్లంగి గ్రామాల్లో బుధవారం ఎంపీడీవో లక్ష్మారెడ్డితో కలిసి కేంద్ర బృందం పర్యటించి,కేంద్ర ప్రభుత్వ పథకాల పనితీరును తెలుసుకున్నారు. అలాగే ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులను పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వ వాటా ఉన్న ప్రతి పథకం ప్రజలకు చేరాలని స్థానిక అధికారులకు సూచించారు.

### రూ.1.67 కోట్ల పంట నష్టపరిహారం

**డొంకేశ్వర్(ఆర్మూర్):** జిల్లాలో మార్చి నెలలో కురిసిన అకాల వర్షాలు, వడగళ్ల కారణంగా నష్టపోయిన రైతులు ప్రభుత్వం పరిహారాన్ని మంజూరు చేసింది. 1,512మంది రైతులకు రూ.1.67కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. నిధులు త్వరలోనే బాధిత రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని పేర్కొంది.

### సాగర్‌లోకి 581 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

**నిజాంసాగర్(జుక్కల్):** రెండు, మూడు రోజుల నుంచి విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకల్లో వరద నీటి ప్రవాహాలు ప్రారంభమయ్యాయి. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు నిజాంసాగర్ ప్రాజెక్టులోకి బుధవారం 581 క్యూసెక్కుల వరద నీరు ఇన్‌ఫ్లోగా వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు. 17.8 టీఎంసీలకు గాను 5.8 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మహమ్మద్‌నగర్ మండలంలోని సింగితం రిజర్వాయర్‌లోకి స్వల్ప ఇన్‌ఫ్లో వస్తోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 416.5 మీటర్లు కాగా.. 408 మీటర్ల మేర నీరు నిల్వ ఉంది.

**ఎస్సారెస్పీలోకి 1794 క్యూసెక్కులు..**
**బాల్కొండ:** ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురు స్తుండడంతో శ్రీరాంసాగర్‌ప్రాజెక్ట్‌లోకి 1,794 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్ట్ నుంచికాకతీయ కాలువ ద్వారా 100, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 321 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091 (80.5 టీఎంసీలు) అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి 1061.8(12.32 టీఎంసీలు) అడుగులు నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

# టీ హబ్‌పై ఓవర్‌లోడ్

- మొరాయిస్తున్న యంత్రాలు
- జీజీహెచ్‌కు ప్రత్యేక ల్యాబ్ కరువు
- ఇటీవల 20 రోజులపాటు పనిచేయని యంత్రం
- బ్లడ్ టెస్టులు లేక రోగులకు ఇబ్బందులు





**నిజామాబాద్‌నాగారం:** రోగుల రక్త పరీక్షలు నిర్వహించే టీ హబ్‌లోని యంత్రం తరచూ మొరాయిస్తోంది. ఓవర్ లోడ్ దీనికి ప్రధాన కారణం. 24గంటల పాటు యంత్రాన్ని ఉపయోగిస్తుండడంతో తరచూ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. టీ హబ్‌లో 136 రకాల పరీక్షలు చేయాల్సి ఉండగా, కేవలం 10 నుంచి 15 లోపు మాత్రమే చేస్తున్నారు. జిల్లా కేంద్ర ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)కు ప్రత్యేకంగా ల్యాబ్ లేకపోవడంతో టీ హబ్‌లోనే రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని 37 పీహెచ్‌సీలు, 12 సీహెచ్‌సీలు, ఆర్మూర్ ఏరియా ఆస్పత్రి, బోధన్ జిల్లా ఆస్పత్రి, 10 యూపీహెచ్‌సీలు, వెల్‌నెస్ సెంటర్ కోసం గత ప్రభుత్వం టీ హబ్ ఏర్పాటు చేసింది. జిల్లా వైద్యారోగ్యశాఖపరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగుల నుంచి రక్త పరీక్షల కోసం నమూనాలు సేకరించి టీ హబ్‌లో పరీక్షలు నిర్వహించి రిపోర్టులను అదే రోజున లేదా మరుసటి రోజు సాయంత్రానికి ఫలితాలను పీహెచ్‌సీలకు మెయిల్ ద్వారా పంపిస్తారు.

**జీజీహెచ్ కారణంగానే..!**
జీజీహెచ్‌లో గతంలో 2వేలకు పైగా ఓపీ రాగా, ప్రస్తుతం 1800 మంది వరకు ఓపీ సేవలు పొందుతున్నారు. వీరిలో కచ్చితంగా 50శాతానికి పైగా రోగులకు రక్త పరీక్షలు చేస్తున్నారు. ప్రతిరోజూ సుమారు 80 మందికిపైగా రోగులు వివిధ అనారోగ్య కారణాలతో అడ్మిట్ అవుతున్నారు. జీజీహెచ్‌కు రోగుల తాకిడి అధికంగా ఉండడంతోనే రక్త పరీక్షల సంఖ్య సైతం పెరుగుతోంది. రక్త పరీక్షలు చేసే యంత్రంపై అధిక లోడ్ పడుతుండడంతో తరచూ మొరాయిస్తోంది. జీజీహెచ్‌కు గతంలో ప్రత్యేక ల్యాబ్ ఉండేది. అప్పుడు వెంటవెంటనే రక్త పరీక్షలకు సంబంధించి రిపోర్టులు వచ్చేవి. టీ హబ్ ఏర్పాటుతో జీజీహెచ్‌లోని ల్యాబ్ కనుమరుగైంది. ల్యాబ్‌లో ఉన్న యంత్రాలు ఎక్కడికి వెళ్లాయో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. జీజీహెచ్ అంతా టీహబ్‌పైనే ఆధార పడి ఉంది. రక్త పరీక్షలకు సంబంధించి రిపోర్టు రాకుండా జీజీహెచ్‌కు వచ్చే రోగులకు వైద్యులు మందులు ఎలా రాస్తారో.. ఇక అడ్మిట్ అయిన రోగుల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో ఊహిస్తేనే దారుణంగా ఉంటుంది. పేదలు వచ్చే జీజీహెచ్‌కు ప్రత్యేక ల్యాబ్ ఉండాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

| | |
|---|---|
| ఏప్రిల్‌లో సేకరించిన రక్త నమూనాలు | 40,901 |
| వివిధ రకాల బ్లడ్ టెస్టులు | 78,278 |
| మే 23 వరకు సేకరించిన శాంపిళ్లు | 16232 |
| బ్లడ్ టెస్టులు | 29,682 |

**వెల్‌నెస్ సెంటర్‌పై ఎఫెక్ట్**
ఇటీవల టీహబ్‌లోని యంత్రం మొరాయించడంతో వెల్‌నెస్ సెంటర్‌లో ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులు, జర్నలిస్టులకు రక్త పరీక్షలు చేయడం ఆపేశారు. సుమారు పది రోజులపాటు రక్త పరీక్షల కోసం శాంపిళ్లు తీసుకోకపోవడంతో రిటైర్డ్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**పర్యవేక్షణ అంతంతే..**
టీ హబ్ పర్యవేక్షణ అంతంతే అన్నట్లు సాగుతోంది. టీ హబ్ యంత్రాలు ఎందుకు మొరాయిస్తున్నాయో తెలుసుకునే ప్రయత్నాలు సైతం సంబంధిత అధికారులు చేయడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలు అందిస్తే రోగులు లక్షలు పెట్టి ఎందుకు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తారని.. దీనిపై ఒకసారి ఆలోచించాలని ప్రజలు కోరుతున్నారు.



టీ హబ్‌లో యంత్రానికి మరమ్మతులు చేస్తున్న టెక్నీషియన్లు(ఫైల్)

**మరమ్మతులు చేస్తున్నా అంతే..**
టీ హబ్‌లో యంత్రాలు చెడిపోవడం, తరచూ మొరాయించడంతో మరమ్మతులు చేస్తూనే ఉన్నారు. ఇటీవల యంత్రం మొరాయించడంతో టెక్నీషియన్‌లు మరమ్మతులు చేపట్టారు. మళ్లీ ఎప్పుడు మొరాయిస్తుందోననే భయభయంగా రక్త పరీక్షలు చేస్తున్నారు.

# రిజిస్ట్రార్ పదవి కోసం..

- కామారెడ్డికి చెందిన కాంగ్రెస్ నేత ద్వారా ప్రయత్నాలు చేసిన ప్రొఫెసర్
- ప్రొఫెసర్ ప్రయత్నాలపై మండిపడ్డ విద్యాశాఖ కార్యదర్శి
- తెలంగాణ యూనివర్సిటీలో ఆగని రాజకీయాలు



**సాక్షి ప్రతినిధి, నిజామాబాద్:** తెలంగాణ విశ్వవిద్యాలయంలో రాజకీయ క్రీడలు ఆగడం లేదు. ఇప్పటికే గత నాలుగేళ్లుగా చిత్రవిచిత్ర రాజకీయాలు, అవినీతి, అక్రమాల నియామకాలతో అభాసుపాలైన వర్సిటీలో కొత్త వీసీ వచ్చాక కొన్ని నెలల పాటు రాజకీయాలకు విరామం దక్కింది. అయితే పాలక మండలి ఏర్పాటు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తాత్సారం చేస్తూ వస్తోంది. ఈ క్రమంలో పాలకమండలి ఏర్పాటు, తరువాత సాధారణ పరిస్థితులు నెలకొంటాయని పలువురు ఆశిస్తూ వస్తున్నారు. అయితే తాజాగా మళ్లీ కుర్చీలాటకు కేంద్రమైన రిజిస్ట్రార్ కుర్చీ కోసం ఒక వివాదాస్పద ప్రొఫెసర్ రాజకీయ క్రీడ మొదలుపెట్టినట్లు విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుల చుట్టూ, ఉన్నతాధికారుల చుట్టూ చక్కర్లు కొడుతూ పైరవీల ద్వారా మళ్లీ రిజిస్ట్రార్ కుర్చీలో కూర్చునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే గత అక్టోబర్ 18న వీసీగా ప్రొఫెసర్ యాదగిరిరావు బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచే సదరు వివాదాస్పద ప్రొఫెసర్ చాప కింద నీరులాగా పైరవీలకు శ్రీకారం చుట్టినప్పటికీ 15 రోజుల క్రితం కామారెడ్డి జిల్లాకు చెందిన కీలకమైన కాంగ్రెస్ నేతను సంప్రదించి, ఆ నేత ద్వారా ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి యెగితారాణాకు లేఖ రాయించుకున్నట్లు సమాచారం.

■ వీసీ యాదగిరిరావు బాధ్యతలు స్వీకరించిన వెంటనే తనకుతానుగా పరిచయం చేసుకుని, తన ప్రతిభను గుర్తించి రిజిస్ట్రార్ పదవి కట్టబెట్టాలని పట్టుబట్టిన విషయం తెలిసిందే. అయితే ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ వచ్చిన వీసీ బోధన, బోధనేతర సిబ్బంది గురించి స్పష్టమైన అవగాహన తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో సదరు ప్రొఫెసర్ ప్రతిపాదనను పక్కన పెట్టారు.

■ వర్సిటీలో నిత్యం కులరాజకీయాలకు కేంద్రబిందువుగా ఉన్న సదరు ప్రొఫెసర్ తన సామాజిక వర్గానికి చెందిన ప్రముఖ కులనేతను సైతం సంప్రదించి వీసీకి చెప్పించే ప్రయత్నం చేయడం గురించి విద్యార్థి సంఘాలు చెబుతున్నాయి. అయితే అప్పటికే అదే సామాజిక వర్గానికి చెందిన మరో ఆచార్యుడికి కీలక పదవి కోసం పైరవీ చేయడం, మరోవైపు వివాదాస్పద ఆచార్యుడి గురించి అన్ని విషయాలు తెలియడంతో వీసీ రిజిస్ట్రార్ పదవి అంశాన్ని సున్నితంగా పక్కకు పెట్టినట్లు తెలిసింది. తిరస్కరణకు గురవుతున్నప్పటికీ ప్రయత్నాలు ఆపడం లేదు.

■ కాగా ఈ ప్రొఫెసర్ కోసం అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన కీలక నేత రాసిన లేఖను చూసిన ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, సదరు నేతకు ఫోన్ చేసి మరీ ఈ ప్రొఫెసర్ గురించి గతంలో జరిగిన ఘటనలను గురించి వివరించినట్లు విశ్వసనీయ సమాచారం.పైగా సదరు ప్రొఫెసర్ పైరవీలు, లేఖ రాయించిన విషయమై ఆమె మండిపడినట్లు తెలిసింది.

# పసుపు రైతుల సంక్షేమానికి కృషి

**సుభాష్‌నగర్:** రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పసుపు రైతుల సంక్షేమానికి కృషి చేస్తామని జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి అన్నారు. నగరంలోని అర్బన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. అనంతరం పసుపు బోర్డు కార్యాలయం ఏర్పాటును హర్షిస్తూ శ్రద్ధానంద్ గంజ్‌లో బీజేపీ నాయకులు, రైతులతో కలిసి విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ప్రధాని మోదీ, ఎంపీ అర్వింద్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. పసుపు బోర్డు కార్యాలయం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వడానికి సహకరించిన ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి, ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కలెక్టర్ హనుమంతుకు గంగారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, వీ మోహన్‌రెడ్డి, పాట్కూరి తిరుపతిరెడ్డి, గోపిడి స్రవంతిరెడ్డి, న్యాలం రాజుతదితరులు పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న పల్లె గంగారెడ్డి, దినేశ్

# బీజేపీయే మన ప్రత్యర్థి

- కుటుంబ కలహాలతో బీఆర్‌ఎస్ కనుమరుగవుతుంది
- పార్టీ కోసం కష్టపడే వారికే ప్రాధాన్యత
- రూరల్ ఎమెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

**డిచ్‌పల్లి/ధర్పల్లి:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీయే మన ప్రత్యర్థి అని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా పరిశీలకులు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ కే తిరుపతి అన్నారు. 2017కి ముందు నుంచి కష్టపడి పని చేసిన వారికి పార్టీ పదవుల్లో తగిన ప్రాధాన్యత ఉంటుందని వారు స్పష్టం చేశారు. పార్టీ సంస్థాగత ఎన్నికల నిర్వహణపై బుధవారం డిచ్‌పల్లి మండలంలోని అమృతాగార్డెన్స్‌లో డిచ్‌పల్లి, మోపాల్, నిజామాబాద్‌రూరల్, జక్రాన్‌పల్లి మండలాల కార్యకర్తలకు, ధర్పల్లి మండల కేంద్రంలో ధర్పల్లి, సిరికొండ, ఇందల్వాయి మండలాల కాంగ్రెస్ కార్యకర్తలకు వారు దిశానిర్దేశం చేశారు. వారం లోగా గ్రామ, మండల కమిటీలకు అభ్యర్థుల పేర్లు ఎంపిక చేసి చేసి తమకు అందించాలన్నారు. పార్టీకోసం కష్టపడే వారికి అండగా ఉంటామని అదే సమయంలో పార్టీకి నష్టం చేసే వారు ఎంతటి వారైన చర్యలు తీసుకునేందుకు వెనకాడబోమని హెచ్చరించారు. అధికారంలో ఉండగానే తాను ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశానని, ఎన్నో ఎదురు దెబ్బలు తిని ఇప్పుడు ఎమ్మెల్యేగా మీ ముందున్నానని భూపతిరెడ్డి అన్నారు. కార్యకర్తల కష్టం తనకు తెలుసునని, పార్టీ విధానంలో భాగంగానే కొత్తవారిని చేర్చుకున్నామన్నారు. పార్టీ కోసం ముందునుంచి ఎవరూ కష్టపడుతున్నారో తనకు తెలుసునని అన్నారు. కుటుంబ కలహాలతో బీఆర్‌ఎస్ కనుమరుగు కానుందని సమావేశంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటిపల్లి నగేశ్‌రెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్‌నాయక్, మాజీ చైర్మన్ మునిపల్లి సాయిరెడ్డి, ఏడు మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు అమృతాపూర్ గంగాధర్, సాయారెడ్డి, చిన్నారెడ్డి, ఎల్లయ్య, బాలరాజ్, నవీన్‌గౌడ్, గంగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాలసాని శ్రీనివాస్, యాదగిరి, నర్సయ్య, సొసైటీ చైర్మన్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యకర్తలనుద్దేశించి ప్రసంగిస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

# పీవోకే సున్నిత అంశం

- ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పాం
- భగవద్గీత, రామాయణంతో దేశంపై గౌరవాన్ని పెంచుకోవాలి
- జమ్మూకశ్మీర్ స్టడీ సెంటర్ దక్షిణ భారత కన్వీనర్ నిమ్మగడ్డ వెంకటప్రసాద్



నిజామాబాద్‌లో మాట్లాడుతున్న నిమ్మగడ్డ వెంకట ప్రసాద్

**సుభాష్‌నగర్/నిజామాబాద్‌రూరల్/బోధన్:** పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే) సున్నితమైన అంశమని, ఈ సమస్యకు త్వరలోనే పరిష్కారం దొరకవచ్చని జమ్మూకశ్మీర్ స్టడీ సెంటర్ దక్షిణ భారత కన్వీనర్, ఉన్నత విద్యాశాఖ విశ్రాంత అడిషనల్ డైరెక్టర్ నిమ్మగడ్డ వెంకటప్రసాద్ ఆకాంక్షించారు. 'కశ్మీర్ చరిత్రలో వక్రీకరణలు – వాస్తవాలు' అనే అంశంపై ఇతిహాస సంకలన సమితి ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలోని పట్టణ మున్నూరుకాపు కళ్యాణ మండపంలో, బోధన్ పట్టణంలో బుధవారం సదస్సులు నిర్వహించారు. అంతకుముందు వీర సావర్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నిమ్మగడ్డ వెంకటప్రసాద్ మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఆక్రమిత కశ్మీర్ సమస్య అలాగే ఉండిపోయిందన్నారు. కశ్మీర్ దేశంలో విలీనం కాకుండా మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, కాంగ్రెస్ నాయకులు కుట్రలు చేశారని అభిప్రాయపడ్డారు. పాకిస్తాన్ భారత్‌పై చేస్తున్న దాడులను తిప్పికొట్టాలని 1997 ఫిబ్రవరి 24న ప్రధాని పీవీ నర్సింహరావు హయాంలో సామూహిక తీర్మానం చేశారని గుర్తు చేశారు. ఆపరేషన్ సిందూర్‌ను భారత సైన్యం 12 రోజుల్లోనే పూర్తి చేసిందని, పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పామన్నారు. అనంతరం దేశంలో భద్రత, రక్షణ, సైనికులు, కశ్మీర్, ఆపరేషన్ సిందూర్ అంశాలపై ప్రజలకు ఉన్న సందేహాలను ఆయన నివృత్తిచేశారు. హైకోర్టు న్యాయవాది కాటిపల్లి మహేందర్‌రెడ్డి, కలువకోట నరేశ్‌కుమార్, గౌరవసలహాదారు ప్రొఫెసర్ చందుపట్ల ఆంజనేయులు, బోధన్‌లో యార్లగడ్డ శ్రీనివాస్‌రావు, ఏకచక్ర సేవా సమితి అధ్యక్షుడు అంకు మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు వర్షాలు సాగుకు అనుకూలమే

- మక్క, సోయా, పసుపు విత్తుకోవచ్చు
- నీటి సౌకర్యం ఉన్న పంటలకైతే ఢోకా లేదు
- చీడపీడల సమస్యలు వస్తే నివారణ జాగ్రత్తలు తీసుకోవాలి
- రైతులతో ఫోన్ ఇన్‌లో డీఏవో వీరాస్వామి

నైరుతి రుతుపవనాల ప్రవేశంతో జిల్లాలో కురుస్తున్న ముందస్తు వర్షాలు సాగుకు అనుకూలమేనని జిల్లా వ్యవసాయాధికారి జి వీరాస్వామి అన్నారు. తేలికపాటి భూముల్లో ఆరు, బరువు నేలల్లో ఏడు సెంటీ మీటర్ల వర్షం కురిసి మట్టి తేమగా ఉంటే మొక్కజొన్న, సోయా, పసుపు విత్తనాలను విత్తుకోవచ్చన్నారు. రానున్న రోజుల్లో వర్షాలను అంచనా వేయలేమని, నీటి సౌకర్యం ఉన్న పంటలకైతే ఢోకా లేదన్నారు. ఒక వేళ వాతావరణం మారితే చీడపీడలు, తెగుళ్లు వచ్చే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండి వాటి నివారణకు జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందని తెలిపారు. బుధవారం నిర్వహించిన 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో డీఏవో మాట్లాడారు. ముందస్తు వర్షాలతో సాగుపై సందేహాలు, విత్తనాల ఎంపిక, ఎరువుల లభ్యతపై రైతులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు. సరైన సమయంలో ఫోన్ ఇన్ నిర్వహించడంపై రైతులు సంతోషం వ్యక్తం చేశారు. – డొంకేశ్వర్(ఆర్మూర్)



**మక్క, సోయా విత్తనాలు ఎప్పటి వరకు వేయొచ్చు?**
– పెద్దగొండ మోహన్(చిన్నయానం, డొంకేశ్వర్ మండలం), నరేశ్ (నందిపేట్), లింగారెడ్డి (రెంజల్, ముప్కాల్ మండలం)
**డీఏవో :** ముందస్తు కురుస్తున్న వర్షాలు మ క్క, సోయా సాగు చేసేందుకు అనుకూలమే. నేల బాగా తడిసి తేమతో ఉంటే విత్తనాలు విత్తుకోవ చ్చు. జూలై 15 వరకు కూడా సాగు చేసుకోవచ్చు. విత్తనం వేసిన తర్వాత వర్షా లు లేకపోతే ఎండకు వి త్తనం కుళ్లిపోయే అవకాశం ఉంటుంది. నీటి సౌ కర్యాన్ని కూడా అందుబాటులో ఉంచు కుంటే మంచిది. విత్తనాలు ఎంచుకునే విషయంలో మా త్రం జాగ్రత్తగా ఉండాలి. సోయాలో జేఎస్–335, ఏఎస్‌బీ–22, జేఎస్–93–05 విత్తనాలు మేలైనవి.

■ **వరిలో కొత్తరకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయా**
– ఆనంద్ కుమార్ (రెంజల్), గంగాధర్ (అర్సపల్లి)
■ దాన్–75 అనే కొత్త రకం వరి విత్తనాన్ని అగ్రికల్చర్ యూనివర్సిటీ తయారు చేసింది. ఈ విత్తనాలు మార్కెట్‌లోకి ఇంకా రాలేదు. కానీ రాజేంద్రనగర్ యూనివర్సిటీకి వెళ్తే ఇస్తున్నారు. జిల్లాకు ఈ విత్తనాలు వస్తే రైతులందరికీ సమాచారం ఇస్తాం. దాన్–75 పేరుతో ఎవరైనా బయట విత్తనాలు అమ్మితే తీసుకోవద్దు. అలాగే యాదాద్రికి చెందిన 202 రకం విత్తనాలపై ఇప్పటికైతే సమాచారం లేదు.

■ **భూసార పరీక్షలు, యూరియా, విత్తనాల జాడ లేదు కదా**
– సంతోష్‌రెడ్డి (జాన్కంపేట్, వేల్పూర్ మండలం)
■ ప్రభుత్వం 50శాతం సబ్సిడీపై అందిస్తున్న పచ్చిరొట్ట విత్తనాల కొరత ఎక్కడా లేదు. పంపిణీ కోసం జిల్లా వ్యాప్తంగా 100 సెంటర్లను ఏర్పాటు చేశాం. ఇతర విత్తనాల విషయంలో ప్రభుత్వం ఎలాంటి సబ్సిడీ ఇవ్వడం లేదు. పచ్చల నడ్కుడలో యూరియా అందుబాటులో ఉంచాం. కొరత ఉంటే వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకెళ్లండి. భూసార పరీక్షలకు మట్టిని జిల్లా కేంద్రంలోని సాయిల్ టెస్ట్ సెంటర్‌కు పంపితే వారు రిపోర్టు ఇస్తారు.

■ **ఇప్పుడే పసుపు విత్తుకోవచ్చా..**
– నర్సయ్య (జీజీ నడ్కుడ, డొంకేశ్వర్)
■ సందేహం లేకుండా పసుపు విత్తనాలు వేసుకోవచ్చు. ముందుగా విత్తనాలను శుద్ధి చేసుకోవాలి. విత్తిన తర్వాత అడుగు మందులు కూడా వేసుకోవచ్చు. కత్తెర పురుగు వస్తే విషపు ఎరను తయారు చేసి చల్లాలి. అదనపు సమాచారం కోసం స్థానిక ఉద్యాన శాఖ అధికారులను సంప్రదిస్తే మరిన్ని సూచనలు, సలహాలు ఇస్తారు.

■ **వరిలో ఏయే విత్తనాలు మేలైనవి**
– దడిగె పెంటన్న (డొంకేశ్వర్), సాగర్ (నికాల్‌పూర్, డొంకేశ్వర్ మండలం)
■ వరిలో చాలా రకాల విత్తనాలు అందుబాటు లో ఉన్నాయి. అందులో దోమ, అగ్గి తెగువంటి చీడపీడలను తట్టుకునే రుద్రూర్–1200, జేజీఎల్–27356, 1246, 11118,1798, సిద్ధి –44, బీపీటీ –5204, ఆర్ఎన్ఆర్–15048, కునారం–1638, ఎంటీయూ–1262 రకాలు మేలైనవిగా చెప్పొచ్చు. ప్రభుత్వం సూచించిన 33 రకాల విత్తనాలను వేసుకుంటే బోనస్ వచ్చేందుకు అవకాశం కూడా ఉంటుంది.

■ **నారు ఏ విధంగా పోస్తే మంచిది**
– రాజు (వేల్పూర్)
■ వర్షాలు కురుస్తున్నందున నారు పోసేందుకు వాతావరణం అనుకూలమే. నారును అలికి పోస్తే మంచిదే.. కానీ వర్షం ఎక్కువ కురిస్తే గింజలు కొట్టుకుపోయి అవకాశం ఉంది. విత్తనం తెచ్చుకోగానే కార్బండైజిన్‌లో వేసుకుని నారు పోసుకోవాలి. నారు తీసే ముందు గుళికలు వేస్తే మంచింది. తెగుళ్లపై జాగ్రత్తలు తీసుకోవాలి.

సాక్షి ఫోన్ ఇన్

■ **నీటి సౌకర్యం లేదు.. సోయా విత్తుకోవచ్చా**
– శ్రీనివాస్‌రెడ్డి (నల్లవెల్లి, ఇందల్వాయి మండలం)
■ నీటి సౌకర్యం లేని భూముల్లో వర్షాకాలం సోయా సాగు చేయొచ్చు. ఒక వేళ వర్షాలకు గ్యాప్ ఏర్పడితే పంటకు ఇబ్బందులు ఏర్పడుతాయి. ప్రత్యామ్నాయంగా నీటి సౌకర్యం కూడా అందుబాటులో చూసుకోవడం ఎంతకైనా మంచింది. ఆలోచించి మీరే నిర్ణయం తీసుకోండి.

## క్లుప్తంగా

### జాతీయ స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

**నిజామాబాద్‌నాగారం:** చండీగఢ్‌లో ఈ నెల 29 నుంచి జూన్ 2 వరకు నిర్వహించే జాతీయ స్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. బాలుర విభాగంలో ఎం నిఖిల్ చంద్ర, సీహెచ్ అరవింద్, ఎల్ లక్ష్వేందర్ కుమార్, బి చందు, బాలికల విభాగంలో బి నిశిత, డి లిఖిత, ఎస్ సౌజన్య, ఎం గంగోత్రి రాష్ట్ర జట్టు తరపున పాల్గొంటున్నట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వి ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగా మోహన్ బుధవారం తెలిపారు. రాష్ట్ర జట్టుకు కోచ్‌గా ఈ నరేశ్ వ్యవహరిస్తున్నారు.

### కొనసాగుతున్న డిగ్రీ పరీక్షలు

**తెయూ(డిచ్‌పల్లి):** తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగినట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఏర్పాటు చేసిన 32 పరీక్షా కేంద్రాల్లో 8,272 మందికి 7,544 మంది హాజరు కాగా 728 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

### కుక్కల దాడిలో జింక మృతి



**రుద్రూర్:** పొతంగల్ మండలం టాక్లీ శివారులో బుధవారం జింకల గుంపు నుంచి దారి తప్పి వచ్చిన ఓ జింకపై కుక్కలు దాడి చేయడంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఫారెస్ట్ సెక్షన్ అధికారి సురేశ్ గ్రామానికి చేరుకొని జింక కళేబరాన్ని అటవీ ప్రాంతంలో దహనం చేశారు. మంజీరా పరివాహక ప్రాంతంలో ఇటీవల జింక పిల్లలు మృతి చెందుతున్నాయి. వారం రోజుల్లో సోంపూర్, టాక్లీ, యాద్‌గార్‌పూర్ గ్రామాల్లో కుక్కల దాడిలో నాలుగు జింకలు మృత్యువాత పడ్డాయి. మంద నుంచి దారి తప్పిన జింక పిల్లలు గ్రామ శివారుల్లోకి రావడంతో కుక్కలు దాడి చేస్తున్నాయి. వారం రోజులుగా వర్షాలు పొలాల్లో బురద ఉండడం వల్ల జింక పిల్లలు పరిగెత్తలేకపోతున్నాయి. దీంతో అవి కుక్కల బారిన పడి మృత్యువాత పడుతున్నాయి. మూగ జీవాలను కాపాడాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

### కొత్తపల్లిలో కొండ చిలువ




**బాల్కొండ:** ముప్కాల్ మండలం కొత్తపల్లిలో చిన్నారెడ్డికి చెందిన పంట భూమిలో పెద్ద కొండ చిలువ ప్రత్యక్షమైంది. దీంతో బుధవారం ఉదయం జిల్లా కేంద్రం నుంచి పాములు పట్టే వారిని పిలిపించి కొండ చిలువను పట్టించారు. కొండ చిలువ చిక్కడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# వెనువెంటనే నిర్మాణ అనుమతులు

- టీజీ బీపాస్ స్థానంలో బిల్డ్ నౌ కొత్త పోర్టల్
- అనుమతులన్నీ ఈ పోర్టల్ ద్వారానే..



బిల్డ్‌నౌ పోర్టల్




టీజీ బీపాస్ పోర్టల్

**నిజామాబాద్ సిటీ:** రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ అనుమతులకు కొత్త పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. గత ప్రభుత్వం రూపొందించిన టీఎస్ బీపాస్ స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం టీజీ బీపాస్‌గా మార్చింది. తాజాగా ప్రభుత్వం బిల్డ్ నౌ అనే పోర్టల్‌ను ప్రవేశపెట్టింది. ఇప్పటివరకు అనుమతుల కోసం ప్రజలు టీజీ బీపాస్ పోర్టల్‌లోనే దరఖాస్తు చేసుకునేవారు. ఇక టీజీ బీపాస్‌కు టాటా చెప్పి బిల్డ్ నౌ కు ఒకే చెప్పనున్నారు.

**అన్ని అనుమతులు పోర్టల్‌లోనే..**

భవన నిర్మాణాలకు సంబంధించి అన్ని అనుమతులు ఇకపై కొత్త పోర్టల్‌లోనే జరగనున్నాయి. గతంలో ఉన్న పోర్టల్‌కు దీనికి పెద్దగా వ్యత్యాసం ఏమీ లేదు. అందులో ఉన్న ఆప్షన్‌లన్నీ ఇందులో కూడా ఉన్నాయి. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీపీ పరిధిలో ఈ పోర్టల్ అందుబాటులోకి వచ్చింది. త్వరలో ఇతర మున్సిపాలిటీలకు కూడా త్వరలోనే అందుబాటులోకి రానుంది. నిమిషాల వ్యవధిలో అనుమతులు లభించనున్నాయి.

**లాగిన్ ద్వారానే...**

భవన నిర్మాణాలకు యథావిధిగా లాగిన్ కావాలి. తర్వాత దరఖాస్తుదారు వివరాలు, భవన నిర్మాణాలకు సంబంధించిన వివరాలు నమోదు చేయాలి. తగిన డాక్యుమెంట్లు జతపరచాల్సి ఉంటుంది. నిర్ణీత ఫీజు కూడా ఆన్‌లైన్‌లోనే చెల్లించాల్సి ఉంటుంది. దీంతో దరఖాస్తుదారు పేరుతో లాగిన్ ఐడీ క్రియేట్ అవుతుంది. వీటి ద్వారా టౌన్‌ప్లానింగ్ అధికారులు సంబంధిత వ్యక్తుల వివరాలు, అందించిన సమాచారం,జతచేసిన ధ్రువీకరణ పత్రాలు ఒర్జినల్‌ను సరిచూస్తారు. అన్ని నిబంధనలు తూచ తప్పకుండా పాటిస్తే వెంటనే అనుమతులు మంజూరు చేస్తారు.

**సేవలు..**

- బిల్డింగ్ పర్మిషన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ కంప్‌లెంట్స్, కాంపౌండ్‌వాల్, లేఔట్ పర్మిషన్, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ వంటి సేవలు వినియోగించుకోవచ్చు.
- ఇంగ్లిషు, తెలుగు, ఉర్దూ మూడు భాషల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.

**ధ్రువీకరణ పత్రాలు**

యాజమాన్య పత్రాలు (ఓనర్‌షిప్ డాక్యుమెంట్లు, సేల్ డీడ్ తదితర), లింక్ డాక్యుమెంట్లు, ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్స్, సెట్‌బ్యాక్ వివరాలు, ప్లాట్‌సైజ్, లే ఔట్ మ్యాప్ జతచేయాల్సి ఉంటుంది.

**బిల్డ్‌నౌ పోర్టల్‌లోనే దరఖాస్తు చేసుకోవాలి**



నగరంలో భవన నిర్మాణాల అనుమతులకు ఇప్పటివరకు టీజీ బీపాస్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకునేవారు. ప్రభుత్వం కొత్త పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇకపై బిల్డ్‌నౌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. త్వరలోనే ఈ పోర్టల్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది. కొత్తగా భవన అనుమతుల కోసం కొత్త పోర్టల్‌నే వినియోగించుకోవాలి. – ఎల్ శ్రీధర్‌రెడ్డి, ఏసీపీ–2

# కొత్త చట్టాలపై అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ సాయిచైతన్య

**సీపీ పోతరాజు సాయిచైతన్య**

**ఖలీల్‌వాడి:** కొత్త చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీపీ పోతరాజు సాయిచైతన్య అన్నారు. బుధవారం నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నూతన నేర న్యాయ చట్టాలపై మీడియా ప్రతినిధులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి సీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 1జూలై2024 నుంచి కొత్తగా ప్రవేశపెట్టిందని, పాత చట్టాలాను సవరించి మూడు కొత్త చట్టాలను రూపొందిచారని, కొత్త చట్టాల ద్వారా వెంటనే ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు అమలులో ఉన్న పాత చట్టాలు ఐపీసీ, సీఆర్‌పీసీ చట్టాలు రద్దయ్యాయని వీటి స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం చట్టాలు అమలులో ఉన్నాయని తెలిపారు. ఈ కొత్త చట్టాలపై అవగాహన కల్పించేందుకు నిజామాబాద్ జర్నలిస్టులతో అవగాహన కల్పించి చట్టాల గురించి ప్రజలకు తెలియజేయాలని వివరించారు. క్రైమ్ వార్తల విషయంలో తప్పనిసరిగా పలు సూచనలు, జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రస్తుతం ఉన్న సమాజంలో టెక్నాలజీని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలే కానీ దానిని దుర్వినియోగం చేయకూడదని సూచించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ(అడ్మిన్) బస్వారెడ్డి, ఏసీపీలు ఎల్ రాజా వెంకట్‌రెడ్డి, జె వెంకటేశ్వర్‌రెడ్డి. పి. శ్రీనివాస్, మస్తాన్ అలీ, రూరల్ ఎస్సై ఎండీ ఆరీఫ్ వుద్దీన్ తదితరులు ఉన్నారు.

## క్రీడా ప్రాంగణమా–శ్మశాన వాటికనా..




మోస్రా క్రీడా ప్రాంగణం



మృతదేహాన్ని దహనం చేసిన ప్రాంతం

మోస్రా మండల కేంద్రంలో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణం శ్మశాన వాటికగా మారింది. దానిని అధికారులు, పాలకులు వాడుకలోకి తీసుకు రావడం లేదు. గ్రామస్తులు మృతదేహాలను క్రీడా ప్రాంగణం ప్రాంతంలో దహనం చేస్తున్నారు. దీంతో ఆటలాడుకునే పిల్లలు సైతం ఇటువైపు రావడం లేదు.
– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్–నిజామాబాద్

## అయోధ్య సాధువుల మహా రామార్చన యజ్ఞం



**నిజామాబాద్ రూరల్:** నగర శివారులోని సారంగపూర్‌లో ఉన్న హరిహరాత్మక్ బాలక్ రాంమందిర్ రామానందచార్య ఆశ్రమంలో అయోధ్య సాధువులు బుధవారం మహారామార్చన యజ్ఞం ప్రారంభించారు. జూన్ 5 వరకు కొనసాగనున్న ఈ యజ్ఞంలో పాల్గొనేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సాధువులు తరలిరానున్నారు. అయోధ్యకు చెందిన ప్రేమ్‌దాస్ మహరాజ్(మౌనీబాబా), ఆశ్రమ పూర్వపీఠాధిపతి రమాపతి దాస్ మహరాజ్ పర్యవేక్షణలో యజ్ఞ కార్యక్రమాలు కొనసాగుతాయని ప్రస్తుత పీఠాధిపతి మంగళ్ దాస్ జీ మహరాజ్ తెలిపారు.

**సాధువుల ప్రత్యేక సాధన**

తమ జీవితాలను భగవంతుని సేవకు అంకితం చేసి ఆధ్యాత్మిక జ్ఞానంతో సమాజ శాంతి, సంతోషం కోసం సాధువులు జీవిస్తారు. తమకు దూరంగా, భగవంతుని సేవకు దగ్గర ఉండే సాధువుల దర్శనం కోసం సామాన్యులు పరితపిస్తుంటారు. అయోధ్య ఖాక్ చౌక్ కు చెందిన సాధువులు పలువురు ప్రస్తుతం నగరంలోని ఉన్న హరిహరాత్మక్ బాలక్ రామ్ మందిర్ రామానందచార్య ఆశ్రమంలో ఇలా సాధన చేస్తున్నారు. జూన్ 5వ తేదీ వరకు యజ్ఞ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

## సమావేశాన్ని విజయవంతం చేయాలి

**ఎల్లారెడ్డి:** భవన నిర్మాణ కార్మికుల సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎల్లారెడ్డి భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు అన్నారు. బుధవారం ఎల్లారెడ్డిలో నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో వారు మాట్లాడారు. హైదరాబాద్ లో నిర్వహించే రాష్ట్ర స్థాయి సమావేశానికి ప్రతి ఒక్క భవన నిర్మాణ కార్మికుడు హాజరు కావాలన్నారు. సాయిబాబా,పద్మారావు ఉన్నారు.

# యువవికాసం లబ్ధిదారులకు 2న మంజూరు పత్రాలు

- మొదటగా రూ. 50 వేలు, రూ.లక్ష లోపు కేటగిరీల వారికి అందజేత
- లబ్ధిదారులు యూనిట్లు స్థాపించి ఆర్థిక పురోగతి సాధించేలా పర్యవేక్షించాలి
- వీసీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అడిషనల్ కలెక్టర్ అంకిత్, అధికారులు

**నిజామాబాద్ అర్బన్:** రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులకు రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2వ తేదీన మంజూరు పత్రాలు (ప్రొసీడింగ్స్) అందజేయనున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి డిప్యూటీ సీఎం బుధవారం సాయంత్రం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా రాజీవ్ యువవికాసంపై సమీక్షించారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులకు మంజూరు ప్రత్రాల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్‌కు సూచించారు. లబ్ధిదారులకు జూన్ 10 నుంచి 15వ తేదీ వరకు యూనిట్ల స్థాపన, నిర్వహణ, మార్కెటింగ్ తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని తెలిపారు. జూన్ 16 నుంచి 20వ తేదీ వరకు సబ్సిడీ మొత్తాన్ని విడుదల చేస్తారని, 21 నుంచి 30వ తేదీ వరకు యూనిట్ల గ్రౌండింగ్ జరిగేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు. షెడ్యూల్‌ను అనుసరిస్తూ జూలైలో రూ.లక్ష నుంచి రూ.2లక్షల లోపు కేటగిరీకి చెందిన లబ్ధిదారులకు, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో రూ.2లక్షల నుంచి రూ. నాలుగు లక్షల కేటగిరీకి చెందిన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. స్థానిక పరిస్థితులు, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా లబ్ధిదారులు యూనిట్లు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాజీవ్ యువ వికాసం పథకం నిరంతర ప్రక్రియ అని, లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వీసీలో లీడ్ బ్యాంక్ మేనేజర్ అశోక్‌చౌహాన్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేశ్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నాగూరావు, బీసీ సంక్షేమ శాఖ సహాయ అధికారి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చూపాలి



మాట్లాడుతున్న నిజామాబాద్ డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, పక్కన కైలాస్ శ్రీనివాస్

**బాన్సువాడ :** విభేదాలు విడిచిపెట్టి కార్యకర్తలందరూ కలిసికట్టుగా స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చూపాలని నిజామాబాద్ డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం బాన్సువాడ శ్రీనివాస గార్డెన్‌లో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు.స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చేలోపు అధిష్టానం నిర్ణయం మేరకు గ్రామ, మండల స్థాయిలో కాంగ్రెస్ పార్టీ కార్యవర్గాలను ఎన్నుకుంటామన్నారు. 2017 కంటే ముందు కాంగ్రెస్ పార్టీలో ఉన్న కార్యకర్తలకే గ్రామ, మండల అధ్యక్ష పదవులు కేటాయించాలని కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కష్టపడి పని చేసిన వారికి గుర్తింపు ఉంటుందని ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి టీడీపీని వదిలి టీఆర్ఎస్‌లో చేరాకే తెలంగాణ ఉద్యమం ఉధృతమైందని మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల అబ్జార్వర్లు వేణుగోపాల్‌యాదవ్, సత్యనారాయణగౌడ్, నాయకులు అంబర్‌సింగ్, అలిబిన్‌అబ్దుల్లా, రత్నకుమార్, ఖలేక్, అసద్, కూనీపూర్‌రాజిరెడ్డి, శంకర్, సురేష్‌బాబా, మన్సూర్, మదుసూదన్‌రెడ్డి, బిట్ల సురేష్, దాసరి శ్రీనివాస్, ఎజాస్, శ్రీనివాస్‌గౌడ్, అజీం, అఫ్రోజ్ తదితరులు ఉన్నారు.

# గ్రామాల్లో కేంద్రం బృందం పర్యటన



కేంద్ర బృందం సభ్యులకు స్వాగతం పలుకుతున్న డిచ్‌పల్లి మండల అధికారులు

**డిచ్‌పల్లి/ ఎడపల్లి:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరు, వాటి ప్రయోజనాలను ప్రజలను అడిగి తెలుసుకునేందుకు కేంద్ర బృందాల సభ్యులు జిల్లాలోని పలు గ్రామాల్లో బుధవారం పర్యటించారు. డిచ్‌పల్లి మండలంలోని నడిపల్లి మేజర్ గ్రామం, ఘన్‌పూర్ గ్రామాలను సెంట్రల్ సెక్రెటేరియట్ సర్వీసెస్ ఆఫీసర్లు భానుప్రతాప్ సింగ్, జైపాల్ మౌర్య, దివ్య సింగాల్, హర్విందర్ పర్యటించారు. స్వచ్ఛభారత్ మిషన్, తడి, పొడి చెత్త నిర్వహణ, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, నిర్వహణపై ప్రజలకు ఉన్న అవగాహన, రైతు బీమా పథకాల అమలుపై అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఎడపల్లి మండలం జానకంపేటలో కేంద్ర బృందం సభ్యులు గ్రామంలోని మహిళా సంఘం సభ్యులతో వారికి అందుతున్న రుణాలపై ఆరా తీశారు.

## నాలుగేళ్లకే నూరేళ్లు..

- అమ్మమ్మ ఇంటికి వచ్చి కానరాని లోకాలకు..
- కొత్తపల్లిలో నీటి గుంతలో పడి బాలుడి మృతి



యశ్వంత్ (ఫైల్)

**మాచారెడ్డి:** ఇంటి బయట ఆడుకుంటున్న నాలుగేళ్ల బాలుడు నీటి గుంతలో పడి మృతిచెందిన ఘటన కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం కొత్తపల్లెలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా రామాయంపేటకు చెందిన భూమ శ్రీలత–సందీప్‌ల రెండో కుమారుడైన యశ్వంత్(4)ను రెండు రోజుల క్రితం అమ్మమ్మ బరిగె నర్సవ్వ కొత్తపల్లెకు తీసుకొచ్చింది. బుధవారం సాయంత్రం బాలుడు ఆడుకుంటూ నీటి గుంతలో పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు గ్రామానికి చేరుకొని గుండెలవిసేలా విలపించారు. కొడుకా నీకు అప్పుడే నూరేళ్లు నిండాయా అంటూ ఆ తల్లి రోదించిన తీరు అక్కడి వారిని కంటతడి పెట్టించాయి. గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.







## క్రైం కార్నర్

### విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



నవీన్ మృతదేహం

**సిరికొండ:** మండలంలోని కొండూర్‌లో విద్యుత్ తీగలు తగిలి ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్సై ఎల్ రామ్ తెలిపిన వివరాల ప్రకారం.. డిచ్‌పల్లి మండలం సుద్దులం గ్రామానికి చెందిన వేల్పూర్ నవీన్(29) అనే యువకుడు వడ్రంగి పని చేయానికి తన మామ అయిన రవి వద్దకు కొండూర్ గ్రామానికి వచ్చాడు. బుధవారం గ్రామ సమీపంలో మూత్ర విసర్జనకు వెళ్లాడు. కిందికి వేళాడుతూ ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను సరి చేయాలని ట్రాన్స్‌కో అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోకపోవడంతో ఓ నిండు ప్రాణం బలైందని గ్రామస్తులు వాపోయారు. వారి నిర్లక్ష్యాన్ని నిరసిస్తు గ్రామస్తులు రహదారిపై రాస్తారోకో చేశారు. విషయం తెలుసుకొని ఘటన స్థలానికి వచ్చిన ఏఈ చంద్రశేఖర్, ట్రాన్స్‌కో సిబ్బందిపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్పల్లి సీఐ భిక్షపతి, ఎస్సై ఎల్ రామ్ గ్రామస్తులను సముదాయించడంతో ఆందోళన విరమించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ట్రాన్స్‌కో అధికారులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### లారీ ఢీకొని ఒకరు..

**ఖలీల్‌వాడి:** నగరంలోని దుబ్బ ప్రాంతంలో లారీ ఢీకొని ఒకరు మృతి చెందినట్లు మూడో టౌన్ ఎస్సై హరిబాబు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బకు చెందిన సుంకరి నర్సయ్య(68) బుధవారం ఉదయం రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొన్నది. ఈ ఘటనలో అతనికి తీవ్రగాయాలు కాగా స్థానికులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి రెండు రోజుల జైలు

**మోపాల్:** మండల కేంద్రంలో ఈనెల 25న నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో మద్యం సేవించి వాహనం నడిపిన కులాస్‌పూర్ తండాకు చెందిన మూడ్ గణేశ్‌కు రెండోరోజుల జైలు శిక్ష విధిస్తూ ప్రత్యేక ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి నూర్జహాన్ బేగం తీర్పు ఇచ్చినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ బుధవారం తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి కఠిన శిక్షలు విధిస్తామని పేర్కొన్నారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని ఎస్సై సూచించారు.

### రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

**కామారెడ్డి క్రైం:** రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ సమీపంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఓ వ్యక్తి అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని రైలు రాకను గమనించి పట్టాలపై తల పెట్టి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కామారెడ్డి రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడి చేతులపై త్రిషూలం, గాయత్రి పచ్చబొట్లు ఉన్నాయి. టీషర్ట్, షార్ట్ ధరించి ఉన్నాడు. వ్యక్తిగత ఆనవాళ్లు లభించలేదు. మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఎవరైనా మృతుడి ఆనవాళ్లు తెలిస్తే రైల్వే పోలీసులకు సమాచారం అందించాలని రైల్వే హెడ్ కానిస్టేబుల్ హన్మాండ్లు కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్



**లింగంపేట:** మండలంలోని పొల్కంపేట శివారులోని పెద్దవాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను బుధవారం సాయంత్రం పట్టుకొని సీజ్ చేసినట్లు ప్రొబేషనరీ ఎస్సై రాఘవేంద్ర తెలిపారు. ఎక్కపల్లి గ్రామానికి చెందిన నీల శంకర్, ల్యాగల గోపాల్ ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### తండ్రి, కూతుళ్ల మధ్య వివాదం పరిష్కారం



**బోధన్:** పట్టణ కేంద్రంలోని దళిత వాడకు చెందిన మున్సిపల్ పారిశుధ్య కార్మికుడు పరమేశ్ కుమార్తె వైష్ణవి రెండేళ్లుగా జిల్లా కేంద్రంలోని బాల సదన్‌లో ఉంటోంది. తన తండ్రి ఆలనా, పాలన పట్టించుకోవడం లేదని బోధన్ పట్టణ కేంద్రంలోని మధ్యవర్తిత్వ కేంద్రాన్ని ఆశ్రయించి ఆదుకోవాలని కోరింది. బుధవారం ఈ కేంద్ర నిర్వాహకులు తండ్రి, కూమార్తెను పిలిపించి కౌన్సెలింగ్ చేశారు. తన నెలసరి వేతనంలో సగభాగం, ఉన్న ఎకరం పొలంలో సగభాగం కుమార్తెకు ఇచ్చేందుకు తండ్రి పరమేశ్ అంగీకరించాడు. ఈ నేపథ్యంలో స్థానిక కోర్టులో అదనపు న్యాయమూర్తి శ్రీనివాస్ వద్దకు ఇరువురిని తీసుకెళ్లగా ఇరువురి అంగీకారం మేరకు అవార్డు ప్రకటించి వారికి అందించారు. ప్రస్తుతం వైష్ణవి తండ్రి మేనత్త వద్ద ఉంటోందని కేంద్ర నిర్వాహకులు, పార లీగల్ వలంటీర్ పద్మాసింగ్ తెలిపారు.

### జీజీహెచ్ ఏడీగా శ్రీనివాస్‌ప్రసాద్

**నిజామాబాద్‌నాగారం:** నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఏడీగా శ్రీనివాస్‌ప్రసాద్ జిల్లాకు రానున్నారు. వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీలో ఏవోగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్ ప్రసాద్ పదోన్నతిపై జీజీహెచ్ ఏడీగా రానున్నారు. ప్రస్తుతం జీజీహెచ్ ఇన్‌చార్జి ఏడీగా డాక్టర్ రాజశేఖర్ విధులు నిర్వర్తిస్తున్నరు. జూన్ మొదటి వారంలో పూర్తిస్థాయి ఏడీ రానున్నారు.